



పల్లెలపై.. పట్టింపేదీ?

చిల్లి గవ్వ లేక గ్రామపంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తం



- నిధులను నిలిపివేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- పైసలు రాక పనులు చేయడంలో ఇబ్బందులు
- 'స్వచ్ఛదనం- పచ్చదనం'కు డబ్బుల కొరత
- పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక రోగాల బారిన ప్రజలు
- మంత్రి సీతక్క చొరవ తీసుకోవాలని విన్నపం

హనుమకొండ టౌన్, ఆగస్టు 7 : దేశానికి పట్టు కొమ్మలైన పల్లెల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. పంచాయతీలకు నిధుల్లేక పల్లెలన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పల్లెల అభివృద్ధిపై ప్రభుత్వానికి పట్టింపులేక పోవడంతో ప్రగతికి దూరంగా మగ్గుతున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయిన నాటి నుంచి పంచాయతీలకు కష్టాలు మొదలయ్యాయి. గ్రామపంచాయతీని నమ్ముకున్న వారంతా రోడ్డున పడ్డారు. కార్మికులతో పాటు సర్పంచ్‌లు తమకు రావాల్సిన పెండింగ్ వేతనాలు, బకాయిల కోసం ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. అయినా ఇవేమీ పట్టించుకోని ప్రభుత్వం.. గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వకుండానే పనులు చేయాలని పంచాయతీ రాజ్ శాఖకు ఆదేశాలు జారీ చేస్తోంది. దీంతో కిందిస్థాయిలో ఉన్న కార్యదర్శులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. మరోపక్క నిధులలేమి కారణంగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సమస్య జటిలమై.. ప్రజలు దోమకాటుకు గురై మంచాన పడుతూ ఆస్పత్రుల ఖర్చులు భరించలేక చివరికి ప్రాణాలు వదులుతున్నారు.

నిధులకు మంగళం

పల్లెల్లో ఏ అభివృద్ధి చేపట్టాలన్న కార్యదర్శులు గ్రామ ఆదాయాన్ని నమ్ముకొని పనులు చేయాలి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులను నిలిపివేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో సర్పంచ్, కార్యదర్శులు పంచాయతీని నెట్టుకొచ్చేవారు. ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ఎనిమిది నెలలు కావస్తుండటంతో మార్చి నెల నుంచి కేంద్రం కూడా నిధులివ్వడం ఆపేసింది. దీంతో గ్రామ ఆదాయమే పంచాయతీలకు ఏకైక దిక్కుగా మారింది. ఖర్చులు ఎక్కువ, ఆదాయం తక్కువ కావడంతో అభివృద్ధిని గాడిలో పెట్టడం కార్యదర్శులకు సవాల్‌గా మారింది. పంచాయతీల్లో యేటా వచ్చే ఆదాయం రెండు, మూడు నెలలకు కూడా సరి పోవడం లేదని కార్యదర్శులు వాపోతుంటే.. మాతృశాఖేమే జేబులో నుంచి పెట్టుకోవాలని ఒత్తిడి పెంచడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలోని గ్రామపంచాయతీలు	
వరంగల్	323
హనుమకొండ	208
భూపాలపల్లి	241
ములుగు	174
మహబూబాబాద్	461
జనగామ	281
మొత్తం	1,688

స్వచ్ఛదనం-పచ్చ'ధనం'కు నిల్

సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినప్పటి నుంచి కార్యదర్శులు గ్రామాభివృద్ధికి తమ జేబులో నుంచి పెట్టుబడి పెట్టుకుంటూ వస్తున్నారు. సర్పంచ్‌లు ఉన్నంతసేపు వారే పెట్టుబడి పెట్టి పల్లెలను ప్రగతి పథాన నడిపించారు. అలా తాము పెట్టిన సొమ్ములను తిరిగి ఇవ్వలేదని సర్పంచ్‌లు, పని చేయించుకుంటూ పైసలు ఇవ్వలేరని పంచాయతీ కార్మికులు వివిధ రూపాల్లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇవన్నీ తెలిసినా ప్రభుత్వం మాత్రం ఎలాంటి బడ్జెట్‌ను విడుదల చేయకుండా కొత్తగా స్వచ్ఛదనం- పచ్చదనం పథకాన్ని తీసుకొచ్చి కార్యదర్శులపై ఒత్తిడిని పెంచింది. ఐదు రోజుల కార్యక్రమాన్ని రూపొందించి ఒక్క పైసా విడుదల చేయకుండా కార్యదర్శులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, కార్యదర్శులు సైతం చేసేదేమీ లేక పల్లెల్లో నలుగురిని కలుపుకొని తూతూమంత్రంగా కార్యక్రమాన్ని నిర్వహించి ఐదు రోజుల కార్యక్రమంలో ఏ రోజుకారోజు మమ అనిపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పైసలు ఇవ్వకపోతే పాపం కార్యదర్శులు మాత్రం ఏం చేస్తారని ప్రజలు సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. ఇక మాజీ సర్పంచులేమో తమ పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుండటంతో తాము అప్పులు తెచ్చిన చోట వడ్డీలు పెరుగుతున్నాయని వాపోతున్నారు.

ముందు పెట్టండి.. తర్వాత వస్తాయి..

8నెలల నుంచి పంచాయతీల్లోని చిన్న చిన్న అవసరాలకు కార్యదర్శులు వారి జేబుల్లో నుంచి డబ్బులు పెట్టుకుంటూ ఆర్థికంగా చతికిలపడతూ వస్తున్నారు. తాజాగా ఆగస్టు 5 నుంచి స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం చేపట్టి ఐదు రోజుల్లో ఒకొక్కరోజు ఒక కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. కానీ పనులు చేసేందుకు మాత్రం పైసలు లేవు.. మీరే జేబుల్లో నుంచి పెట్టండి.. తర్వాత మీ అకౌంట్స్‌కు జమ చేస్తామని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తుండటంతో కార్యదర్శుల పరిస్థితి మూలిగే నక్కమీద తాటికాయ పడ్డ చందంగా మారింది. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమానికి ముందు జిల్లా పంచాయతీ అధికారి నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో పలువురు కార్యదర్శులు తమ బాధలను విన్నవించుకున్నప్పటికీ.. తాను చేసేది ఏమీ లేదని, ఏమైనా ఉంటే కలెక్టర్‌కు చెప్పుకోండి.. అంటూ దాటేసినట్లుగా సమాచారం. జిల్లా పంచాయతీ అధికారి నుంచే సరైన మద్దతు లేనప్పుడు తమకు దిక్కెవరని కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు.

పల్లెల్లో రోగాల విజృంభణ

నిధుల లేమితో పల్లెల్లో దోమల నివారణకు పిచికారి, చెత్త సేకరణ అరకొరగా చేస్తున్నారు. కార్మికులకు సకాలంలో జీతాలు అందక నిరసన బాట పట్టడం ఒకపక్క అయితే.. మరోపక్క చెత్త తరలించేందుకు ట్రాక్టర్లలో డీజిల్ పోయలేక మరోపక్క పల్లెల్లో శానిటేషన్ దుర్భరంగా తయారైంది. వర్షాకాలం నేపథ్యంలో మొక్కలు, గడ్డి ఏపుగా పెరిగి చెత్తంతా జమై పల్లెల్లో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో దోమకాటుకు ప్రజలు మంచాన పడుతున్నారు. దీంతో ఇటీవల పల్లెల్లో జ్వరాలు పెరిగి డెంగీతో మరణించిన సందర్భాలు ఉన్నాయి. గ్రామాల అభివృద్ధికి సరిపడా నిధులను సమకూర్చి పల్లెల్లో ఆరోగ్య వాతావరణం కల్పించేలా పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అడకత్తెరలో..



- నిధుల లేమితో గ్రామ కార్యదర్శుల ఇబ్బందులు
- అప్పులు చేసి గ్రామాలను నెట్టుకొస్తున్న వైనం
- ఒక్కో కార్యదర్శికి రూ.లక్షకు పైగా ఖర్చు
- ప్రత్యేక పాలన ఆరంభం నుంచి ఇదే దుస్థితి

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 7: ఓ వైపు పని ఒత్తిడి.. మరో వైపు నిధుల లేమి.. అయినా తప్పదు గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి బాధ్యత మీదే అంటూ ప్రభుత్వ ఆదేశాలు.. వెరసి గ్రామ కార్యదర్శుల పరిస్థితి 'అడకత్తెరలో పోకచెక్క'లా తయారైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో భారమంతా కార్యదర్శులపైనే పడుతోంది. ప్రత్యేక పాలన ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు గ్రామంలో ఎలాంటి సమస్యలు వచ్చినా వారి సొంతడబ్బు పెట్టుకుని పనులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇక మైనర్ గ్రామ కార్యదర్శుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. దీనికి తోడు ప్రభుత్వం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తుండటంతో ఇబ్బందులు రెట్టింపయ్యాయి. కొన్నిచోట్ల కార్యదర్శులతో పాటు స్పెషల్ ఆఫీ సర్లు కూడా వారి సొంత డబ్బులు పెట్టుకుని మరీ కార్యక్రమాలను నెట్టుకొస్తున్నట్లు సమాచారం.

> **నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాం..**
>
> 'ప్రత్యేక పాలన నుంచి పంచాయతీల్లో నిధుల కొరత ఉంది. ప్రస్తుతం జరుగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి సైతం ప్రత్యేక నిధులేమి లేవు. జీపీ నుంచి అన్ని కార్యక్రమాలకు డబ్బులు వెచ్చిస్తున్నాం. ఎలాంటి కార్యక్రమాలకైనా కార్యదర్శులమే జేబుల్లో నుంచి పెట్టుబడి పెడుతున్నాం. బ్యాంకుల్లో చెక్కులు కూడా పాస్ కావడం లేదు. ఇలా దాదాపు మేజర్, మైనర్ గ్రామ పంచాయతీల్లో రూ.లక్షకు పైగా డబ్బులు ఖర్చు చేసి ఉన్నాం' అంటూ ఓ పంచాయతీ కార్యదర్శి తన ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్వహణ భారం

ఏడు నెలల నుంచి గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యత పూర్తిగా కార్యదర్శులపైనే పడింది. గ్రామంలో ఏ పనిచేయాలన్నా డబ్బులు లేకపోతే అంతే పరిస్థితి. వస్తున్న పన్నులు కార్యాలయ నిర్వహణ, సిబ్బంది జీతాలకే చాలడం లేదు. దీంతో కొన్ని నెలలుగా సిబ్బంది జీతాలు సైతం లేక విల విలలాడుతున్నారు. నీటి సరఫరా మొదలు.. పారిశుధ్యం, వీధిదీపాలు, చెత్త వాహనాల నిర్వహణ, ట్రాక్టర్ల ఈఎంఐలు ఇలా ఎన్నో ఇబ్బందులు పడుతూ పంచాయతీ పాలనను ముందుకు తీసుకెళ్తున్నారు. బోరు మోటార్లు బాగు చేయించడం, కల్వర్టులను శుభ్రం చేయించడం,

మిగతా 7వ పేజీలో..

ఇబ్బందులు లేకుండా పనులు జరుగుతున్నాయి..



- లక్ష్మీరమాకాంత్, జిల్లా పంచాయతీ అధికారి

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఐదురోజుల పాటు గ్రామాలల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పల్లెలను శుభ్రంగా తయారుచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దానిలో భాగంగా ఈ నెల 5 నుంచి 3 రోజులుగా రోజుకొక్క కార్యక్రమంతో గ్రామాల్లో ఎలాంటి అటంకాలు లేకుండా కార్యదర్శులు విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోకి వెళ్ల పరిశీలిస్తే కార్యక్రమం ఏ విధంగా జరుగుతుందనేది అర్థమవుతుంది.

స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర ఆర్థిక సంఘం కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా 2వ ఆర్థిక సంఘం సమీక్ష



మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు7: స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఆర్థిక సంఘం కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా 2వ ఆర్థిక సంఘం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ..

మిగతా 8వ పేజీలో..

విద్యారంగానికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట

- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మహబూబాబాద్ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో డార్మెంటరీ, డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 7 : రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తూ పెద్దపీట వేస్తోందని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మానుకోట పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలోని వసతి గృహంలో రూ.2.80 కోట్లతో నిర్మించిన డార్మెంటరీ, డైనింగ్ హాల్‌ను బుధవారం ప్రారంభించారు. పాఠశాలలోని తరగతి గదులు, హాస్టల్‌లో ఉన్న వసతులను పర్యవేక్షించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని అందుకోసం విద్యారంగంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. విద్యార్థులు లక్ష్యంతో చదివి తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని చెప్పారు. ఎలాంటి సమస్యలున్న వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. పదో తరగతిలో 10/10 పాయింట్లు సాధించిన విద్యార్థులకు ప్రత్యేకంగా బహుమతులు అందజేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, మునిసిపల్ వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్ దండెబోయిన బుజ్జివెంకన్న, కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, హెచ్ ఎం.పొడుగు నర్సయ్య పాల్గొన్నారు.



గార్లలో పొంగి ప్రవహిస్తున్న వాగు

జోరువాన

- పలుచోట్ల పొంగుతున్న వాగులు
- ముంపునకు గురైన కాలనీలు
- రోడ్డుపై కూలిన చెట్లు, రాకపోకలకు అంతరాయం

జిల్లాలో దంచి కొట్టిన వర్షం



పెనుగొండ నేతాజీతండా పాఠశాలలోకి చేరిన వర్షం నీరు



మానుకోట-కేసముద్రం రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు

మహబూబాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం భారీ వర్షం కురిసింది. మానుకోట పట్టణంలో వాన దంచి కొట్టింది. దీంతో రోడ్లపై వరదనీరు ప్రవహించింది. అనేక కాలనీలకు వెళ్లే రహదారుల్లో నీరు నిలిచిపోయి, చెరువులను తలపిస్తున్నాయి. బయ్యారంలోని పలు వాగులు, ప్రవహిస్తుండడంతో గార్ల మున్నేరుకు వరద తాకిడి పెరిగింది. గార్ల, డోర్నకల్ వద్ద మున్నేరువాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. కొత్తగూడలో పలు వాగులుపొంగి ప్రవహిస్తున్నాయి. మరిపెడలోని ఎల్లంపేట రాళ్లవాగు పొంగిపొర్లుతుండడంతో మరిపెడ-ఎల్లంపేట మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పత్తి, వరిచేలు నీటితో మునిగిపోయాయి. పొలాలు, చెలకల్లో ఎటు చూసినా వరద నీరే కన్పిస్తోంది.

జిల్లాలో ఇలా..

మానుకోట పట్టణంలో భారీ వర్షం కురిసింది. బలమైన గాలులు వీయడంతో పట్టణ శివారులోని ఆర్తిగార్డెన్ సమీపంలో భారీ చెట్లు రోడ్డుపై కూలింది. దీంతో మహబూబాబాద్-ఇల్లందు, భద్రాచలం వెళ్లే బస్సులు భద్రాచలం, ఇల్లందు, మహబూబాబాద్‌కు వచ్చే బస్సులు, ఆటోలు, వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ స్పందించిన ఘటన స్థలానికి చేరుకుని మునిసిపల్ సిబ్బంది సమన్వయంతో జేసీబీ రప్పించి, రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లును తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి. దాదాపు 40 నిమిషాల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం

మిగతా 8వ పేజీలో..

జిల్లాలో వర్షపాతం ఇలా..

జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వరకు బయ్యారం, చిన్నగూడూరు, కొత్తగూడ, గూడూరు, మరిపెడ, నెల్లికుదురు, కురవి, మహబూబాబాద్ మండలాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో కూడా వాన పడింది. కొత్తగూడలో 29.6, గంగారంలో 15.7, బయ్యారంలో 37.9, గార్లలో 26.2, డోర్నకల్‌లో 13.5, కురవిలో 21.6, మహబూబాబాద్‌లో 18.1, గూడూరులో 16.8, కేసముద్రంలో 8.6, నెల్లికుదురులో 27.8, నర్సింహులపేటలో 20.0, చిన్నగూడూరులో 37.8, మరిపెడలో 17.1, దంతాలపల్లిలో 12.1, తొర్రూరులో 10.4, పెద్దవంగరలో 11.7, సీరోలులో 13.0, ఇనుగుర్తిలో 13.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, వెరసి 351.0 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. జిల్లా సగటున 19.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



మూడు అడుగుల మత్తడితో పరవళ్లు తొక్కుతున్న బయ్యారం పెద్ద చెరువు

నీటి సమస్య రాకుండా చూడాలి

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం, ఆగస్టు 7 : నామాలపాడులోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్)లోని విద్యార్థులకు నీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. బుధవారం ఈఎంఆర్ఎస్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం వడ్డించడంతో పాటు పాఠశాల పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, కాంగ్రెస్ నాయకులు సోమేష్, రాంమూర్తి, ప్రవీణ్‌నాయక్, శ్రీనివాస్, సురేష్, నాగరాజు, పాల్గొన్నారు.



నామాలపాడులోని ఏకలవ్య పాఠశాల్లో భోజనం పరిశీలిస్తున్న కోరం కనకయ్య

చెరువుల్లో గుర్రపు డెక్కలు తొలగించాలి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 7: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 9 చెరువులు, కుంటలలో గుర్రపు డెక్కలు పెరిగి పరిసరాలు కలుషితమవుతున్నాయని, చెరువుల్లో మొలిచిన గుర్రపు డెక్కలను వెంటనే తొలగించాలని చెరువుల ఆక్రమణ ఏరియాల పరిరక్షణ సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్ వెల్లడించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి వినతి పత్రం సమర్పించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సంఘం నాయకులు నగేశ్, వెంకటేశ్వర్లు, క్రాంతి ఉన్నారు.

అడకత్తెరలో 'కార్యదర్శి'

(5వ పేజీ తరువాయి)

పైపులైన్ లీకేజీలు అరికట్టడం, చేతిపంపులు పాడైతే సరిచేయడం, నీటి ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్, ఇలా గ్రామంలో తర చూ ఏర్పడే సమస్యలనీ కార్యదర్శులే సొంత డబ్బులు పెట్టుకొని చేయాల్సి వస్తోంది. నిధులు జీపీలో లేకపోవడం వల్ల ఈ సమస్య ఉందని చెప్పకనే చెబుతున్నారు. ఈ వెతలు ప్రభుత్వం నియమిం చిన ప్రత్యేకాధికారులకు సైతం కొన్ని చోట్ల లేకపోలేదు. తమ జీతాల్లో నుంచి ప్రతీ నెలా జీపీకి ఖర్చుపెట్టే వారు కూడా ఉన్నారు.

మార్చిలో కేంద్ర నిధులు

ప్రత్యేక పాలన ప్రారంభమైన తర్వాత ఈ ఏడాది మార్చి నెలలో కేంద్రం జీపీలకు నిధులు విడుదల చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు విడుదల కాలేదు. ఇక రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులు కూడా అందకపోవడంతో గ్రామ పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. కొన్ని నెలల పాటు మార్చిలో వచ్చిన కేంద్ర నిధులతో పంచాయతీలు నడిచినప్పటికీ, ముఖ్యంగా మైనర్ పంచాయతీలకు ఇబ్బందులే తలెత్తాయి. మేజర్ గ్రామ పంచాయతీలకు కొంత మేర డబ్బులు ఎక్కువగా విడుదల కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. కానీ, ప్రస్తుతం ఇప్పుడు అందరి పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది.

భారమైన స్వచ్ఛదనం-పచ్చదనం

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం గ్రామాల్లో ఈనెల 9వరకు జరగనుంది. ఈ కార్యక్రమాలను గ్రామ పంచాయతీ కార్యదర్శులే తమ భుజస్కందాలపై వేసుకున్నారు. ఉదయం లేచిన నుంచి సాయంత్రం వరకు కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా వాటికి అయ్యే ఖర్చులు పూర్తిగా భరించడం వారి బాధ్యతే. ఇప్పటికే నిధులు లేక ఇబ్బందులు పడుతున్న సెక్రటరీలకు ఈ ప్రోగ్రామ్ పెద్ద సవాల్‌గా మారింది. ఏ పనులు చేయాలన్నా డబ్బులతో ముడిపడి ఉన్న అంశం కావడంతో కార్యదర్శులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ, జిల్లా ఉన్నతాధికారుల విజిటింగ్, కార్యక్రమాలు చేసేందుకు ప్రజలను తీసుకురావడం, పనులు చేసేందుకు ప్రైవేటు వ్యక్తులను కూలీకి తీసుకురావడం, మిషనరీ ఏర్పాటు, దోమల మందులు, బ్లీచింగ్, డోజర్ కిరాయిలు ఇలా ఎన్నో పనులకు డబ్బులు కార్యదర్శులు పెట్టుకోవాల్సి వస్తోంది.

రూ.లక్షకు పైగా ఖర్చు

మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు మైనర్ గ్రామ పంచాయతీల ఖర్చులు కొంచెం అటు ఇటుగా ఉన్నా వసతుల కల్పనలో సమానంగా ఉంటున్నారు. దీంతో జీపీ కోసం పెట్టే ఖర్చు ఇప్పటికే ఒక్కో కార్యదర్శికి రూ. లక్షకు పైగా దాటిందని తెలుస్తోంది. కొన్ని పనులకు ఎంబీ రికార్డులు చేయించి మరీ సిద్ధంగా ఉన్నారు. కానీ, గ్రామంలో మౌలిక వసతుల కల్పన కోసం పెట్టే ఖర్చులు రాసి పెట్టుకుంటున్నారు. దీంతో తమ జీతాలే కాకుండా బయట తెలిసిన వ్యక్తుల వద్ద అప్పులు చేసి గ్రామాలను నెట్టుకొస్తున్నారు. వీరికి సహకారంగా కొన్ని చోట్ల ప్రత్యేక అధికారులు చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

ఖాతాల్లో డబ్బులు ఫ్రీజ్

కొన్ని గ్రామపంచాయతీల్లో నిధులు ఉన్నప్పటికీ వాటిని విడుదల చేసేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఖాతాల్లో ఉన్న డబ్బులు తీసేందుకు చెక్కులతో బ్యాంకుకు వెళ్తే పాస్ కావడం లేదు. దీనిపై అధికారికంగా జిల్లా పంచాయతీ అధికారులు ధ్రువీకరించనప్పటికీ ప్రస్తుతం కార్యదర్శులు ఎదు ర్కొంటున్న సమస్యలు ఇవే. డబ్బులు ఉన్నట్లు చూపుతున్న ప్పటికీ వాటిని డ్రా చేసేందుకు మాత్రం వీలు లేదు. దీంతో మరింత ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతంలో గ్రామంలో కొన్ని పనులు చేసి వాటిని తీసుకోని సదరు కాంట్రాక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులకు సైతం ఈతిప్పలు తప్పడం లేదు.

రాజకీయ ఒత్తిడి

ప్రత్యేక పాలన ప్రారంభమైన నాటి నుంచి కార్యదర్శులకు రాజకీయ ఒత్తిడి కూడా ఎక్కువైందనే చెప్పాలి. సర్పంచ్ లేకపోవడంతో ఏ చిన్న సమస్య ఏర్పడినా ఇటు ప్రజలతో పాటు ఇతర అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామా ల్లో చోటామోటా నాయకులు కార్యదర్శినే ప్రశ్నిస్తున్నారు. తమ కాలనీకి నీళ్లు రావడం లేదనో, స్ట్రీట్ లైట్ వెలగడం లేదనో, దోమల మందు కొట్టడం లేదనో ఏదో విధంగా కార్యదర్శిని ఏకంగా బెదిరింపులకు సైతం దిగుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ దృష్టి సారించి ప్రత్యేక నిధులు అందించి ఇబ్బందులు లేకుండా చేస్తే బాగుంటుందని కోరుతున్నారు.

రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 7: హనుమకొండ ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీలో 50 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫార్మసీ, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 30 యేళ్ల వయస్సుగల నిరుద్యోగులు అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7893394393లో సంప్రదించాలన్నారు.

తెలుగులో సంపత్‌రెడ్డికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 7: కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పరిశోధకుడు వంగాల సంపత్‌రెడ్డి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు బుధవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి సంపత్‌రెడ్డికి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'చెరబండరాజు నవలలు, కథలు - తెలంగాణ జనజీవితం' అనే అంశంపై కేయూ మాజీ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే పర్యవేక్షణలో వంగాల సంపత్‌రెడ్డి పరిశోధన పూర్తి చేశారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వీరు అనేక అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టరేట్ సాధించిన వంగాల సంపత్‌రెడ్డిని నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల హిందీ లెక్చరర్ కొమురారెడ్డితో పాటు పలువురు అభినందించారు.

అంతర్జాతీయ సెమినార్‌కు సంకినేని వెంకట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 7: కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్‌కు ఈనెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు బుధవారం సెమినార్ నిర్వాహకులు వెంకట్‌కు ఆహ్వానం పంపినట్లు తెలిపారు. 'ట్రైబల్ లైవ్‌లీ వుడ్ పార్నన్స్ ఇష్యూష్ స్ట్రాటజీస్ ఫర్ ఇంపవర్‌మెంట్ అనే అంశంపై జరిగే సదస్సులో డాక్టర్ సంకినేని వెంకట్ 'డెమోక్రటైజేషన్ ఇన్ ట్రైబల్ ఏరియాస్ అండ్ చాలెంజెస్' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పిస్తారు. ఈ సందర్భంగా వెంకట్‌ను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, రాజనీతిశాస్త్ర అధ్యాపకులు అభినందించారు.

డాక్టర్ అడ్లూరికు భారత్ సేవా పరస్కారం



హనుమకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గణిత శాస్త్రవేత్త, గణిత అవధాని డాక్టర్ అడ్లూరు నర్సింహమూర్తికి బెంగుళూరుకు చెందిన వెయిల్ ఫౌండేషన్ ఇండియా భారత సేవా పురస్కారానికి ఎంపిక చేసింది. నాలుగు దశాబ్దాలుగా గణిత రంగంలో చేసిన విశేషసేవలకు, చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఆయన ప్రతిష్ఠాత్మకమైన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. డాక్టర్ అడ్లూరు గణితంపై రాసిన పదమూడు పరిశోధనా వ్యాసాలు వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఆయనను ఇప్పటికే పలు అవార్డులు వరించాయి. ముంబైకి చెందిన ఎంవీఎల్‌ఏ ట్రస్ట్ రాష్ట్రీయ ఆచార్య శిరోమణి అవార్డును, కిందటేడు గోవా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టర్‌ను ప్రదానం చేశాయి. గణిత అష్టావధానాలతో గుర్తింపు పొందిన డాక్టర్ నర్సింహమూర్తి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు దక్కించుకున్నారు. మదర్ థెరిస్సా అవార్డును అందుకున్నారు.

'సినారె' పురస్కారానికి మహేందర్ ఎంపిక



హనుమకొండ కల్చరల్, ఆగస్టు 7: హనుమకొండ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు బిల్ల మహేందర్‌కు రాష్ట్ర స్థాయిలో అందించే సినారే పురస్కారం-2024కు ఎంపికయ్యారని సంస్థ అధ్యక్షుడు మడకెల్లి రాములు, నిర్వాహకులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మహాకవి సినారే కళాపీఠం యేటా డాక్టర్ సి.నారాయణరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో సాహిత్య రంగంలో విశేషకృషి చేసిన వారిని ఎన్నికచేసి ఈ పురస్కారాన్ని అందిస్తున్నారు. దానిలో భాగంగా జిల్లా నుంచి మహేందర్‌కు ఈ యేడు పురస్కారం లభించింది. పదిహేనేళ్లుగా మహేందర్ వివిధ ప్రక్రియలో సాహిత్య సేవ చేస్తున్నారు. ఇప్పటి వరకు వివిధ సామాజిక, సమకాలీన అంశాలపై ఆరు కవితా సంపుటాలతో పాటుగా తన సంపాదకత్వంలో నాలుగు సంకలనాలను అచ్చు వేశారు. ఈ నెల 10న హైదరాబాద్‌లో సినారే కళా పీఠం వారి ఆధ్వర్యంలో తెలంగాణ తొలి సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా ఈ సత్కారం జరుపబడుతుందని నిర్వాహకులు తెలియజేశారు. మహేందర్‌కు పురస్కారం లభించడంపై ఓరుగల్లు కవులు, రచయితలు, ఉపాధ్యాయులు సంతోషంతో పాటు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మంత్రి నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సామల సదానందం



మంత్రి నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆడెపు శ్రీనివాస్

ఇద్దరు నేతన్నలకు రాష్ట్ర స్థాయి అవార్డులు

హైదరాబాద్‌లో అందజేసిన మంత్రి తుమ్మల

ఆటోనగర్ (వరంగల్), ఆగస్టు 7: జాతీయ చేనేత కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో బుధవారం వేడుకలను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి చేనేత జౌళి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ క్రమంలో వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడకు చెందిన ఇద్దరు చేనేత కార్మికులు సామల సదానందం, ఆడెపు శ్రీనివాస్‌కు ఆయన కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర స్థాయి అవార్డులతో పాటు రూ.25వేల నగదు బహుమతిని చెక్కుల రూపంలో అందజేశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి చేనేత కార్మికుల పోటీల్లో సామల సదానందం(సీఎం రేవంత్‌రెడ్డి బొమ్మ), ఆడెపు శ్రీనివాస్(మహాత్మా గాంధీ బొమ్మ)ల డిజైన్లను నేసి ప్రదర్శించినందుకు గాను ఈ అవార్డులకు ఎంపికయ్యారు. అనంతరం వరంగల్ కార్పెట్లను వివిధ దేశాలకు, దేశంలోని వివిధ రాష్ట్రాలకు సొంత మార్కెట్ వ్యవస్థను నెలకొల్పి చేనేత కార్మికులకు నూతన డిజైన్ల ఆర్డర్లను ఇప్పిస్తూ చేనేత కార్మికులకు పనికల్పిస్తున్న వరంగల్ కొత్తవాడకు చెందిన యువకుడు చిప్ప కిరణ్‌కుమార్ నేతను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అభినందించారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పప్పుల వెంకటేశం, డిప్యూటీ డైరెక్టర్ ఇందుమతి, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వరు, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, నాయకులు ఎం.రవికుమార్, వరలక్ష్మి, రూప తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఎస్డీఎల్‌సీఈ ఎంఎస్‌డబ్ల్యూ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఆగస్టు7: కాకతీయ యూనివర్సిటీ మాస్టర్ ఆఫ్‌సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ) ఫైనల్ ఇయర్ పరీక్షలు ఈనెల 17 నుంచి నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో రివైజ్డ్ పరీక్షల షెడ్యూల్‌ను వెల్లడించారు. ఆగస్టు 17, 20, 24, 28, 30, సెప్టెంబరు 2వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షల జరుగుతాయని వెల్లడించారు. అభ్యర్థులకు క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్షలకేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

13 నుంచి దూరవిద్య బీఎల్ఐఎస్సీ పరీక్షలు

ఈనెల 13 నుంచి బ్యాచ్‌లర్ ఆఫ్ లైబ్రరీ ఇన్ఫర్మేష న్ సైన్స్ (బీఎల్ఐఎస్సీ) ఎక్స్‌అభ్యర్థుల రివైజ్డ్ పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఆగస్టు 13, 16, 19, 21, 23, 27, 29 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగు తాయని పేర్కొన్నారు. అలాగే ఆగస్టు 30న మధ్యాహ్నం ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

13 నుంచి బీఎల్ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఈనెల 13నుంచి కేయూ బీఎల్ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయి. ఆగస్టు 13, 16, 19, 21 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాల, కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కేయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు షురూ

కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని పీజీ కోర్సుల ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్) రెండో సెమి స్టర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్షలు ఆగస్టు 7, 9, 12, 14, 16, 19 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. వర్సిటీ పరిధిలో 5,150 మంది పరీక్షలు రాయనున్నారు. బుధవారం పరీక్షల నిర్వహణను పరీక్షల నియంత్రణాధికారులు పరిశీలించారు.



నిండుకుండలా లక్నవరం చెరువు



మత్తడి దుంకుతున్న లక్నవరం జలాలు

లక్నవరం చెరువుకు మత్తడి

గోవిందరావుపేట, ఆగస్టు 7: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని ప్రఖ్యాత లక్నవరం చెరువు మత్తడి పోస్తోంది. 33.6 అడుగుల నీటినిల్వ సామర్థ్యం కలిగిన చెరువు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోగా ఎగువ నుంచి పెద్దఎత్తున వరద పోటెత్తడంతో బుధవారం ఉదయం నుంచి 5 సెంటీమీటర్ల ఎత్తులో జలాలు మత్తడి దునుకుతున్నాయి. దీంతో దయ్యాలవాగులో ప్రవాహం పెరిగింది. కొత్తగూడ, గంగారం అటవీ ప్రాంతం నుంచి, బొగ్గుల వాగు నుంచి లక్నవరానికి వరద కొనసాగుతోంది.

నిండా నీటితో కళకళలాడుతున్న లక్నవరం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. తేలికపాటి వర్షాలు కురుస్తుండటం, సందర్శనకు ఆంక్షలు లేకపోవడంతో చెరువులో బోటింగ్ చేస్తూ ప్రకృతి అందాలను తిలకించేందుకు టూరిస్టులు తరలిరానున్నారు.



జలకళతో పాకాల సరస్సు



మత్తడికి చేరువైన నీరు

మత్తడికి చేరువలో పాకాల చెరువు

ఖానాపురం, ఆగస్టు 7: వరంగల్ జిల్లాలోనే సాగునీటి వనరుల్లో పెద్దదైన పాకాల సరస్సు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. సరస్సు జలకళను సంతరించుకొని మత్తడికి చేరువలోకి వచ్చింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాకాల సరస్సు బుధవారం నాటికి 29.8 అడుగుల నీటిమట్టానికి చేరుకుని నిండు కుండలా ఉంది. సరస్సు పూర్తి నీటి సామర్థ్యం 30.2 అడుగులు కాగా, మరో ఆరు ఇంచుల నీరు చేరితే మత్తడితో పరవళ్లు తొక్కనుంది. పాకాల ఆయకట్టులో వరినాట్లు జోరుగా సాగుతున్న తరుణంలో ఆయకట్టు రైతులు జలకళను సంతరించుకున్న పాకాల సరస్సును సందర్శించి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గూడూరు మండలం భీమునిపాదం జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

ఉప్పొంగుతున్న భీమునిపాదం

జలపాతం వద్ద పర్యాటకుల సందడి

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 7 : ఎత్తైన గుట్టలు, ఆరుదైన వృక్షాలు, అబ్బురపరిచే భీమునిపాదం జలపాతం వద్ద పర్యాటకుల సందడి పెరిగింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప అటవీప్రాంతంలో ఉన్న భీముని పాదం జలపాతం 70 ఫీట్ల ఎత్తునుంచి వాటర్‌ఫాల్స్ జాలువారుతున్నాయి. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షానికి భీమునిపాదంలో వాటర్‌ఫాల్స్ ఉధృతంగా జాలువారుతున్నాయి. పచ్చని ప్రకృతి నడుమ, ఆహ్లాదకరమైన వాతావరణంలో వాటర్‌ఫాల్స్ కింద తడుస్తూ పర్యాటకులు కేరింతలు కొడుతున్నారు. భీమునిపాదంలో పచ్చని ప్రకృతిని ఆస్వాదించడానికి వాచ్‌టవర్ కూడా నిర్మించిన విషయం విదితమే. బుధవారం కురిసిన వర్షానికి భీముని పాదంలో వాటర్‌ఫాల్స్ భారీస్థాయిలో జాలువారుతుండడంతో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. హన్మకొండ నుంచి భీమునిపాదంకు కేవలం 70 కిలోమీటర్లు, మహబూబాబాద్ నుంచి 40 కిలో మీటర్లు ఉంటుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు, అటవీశాఖసిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కేయూ డిగ్రీ విద్యార్థులకు ఇన్‌స్టంట్ అవకాశం

- 6వ సెమిస్టర్ ఏదైనా ఒక్కపేపర్ తప్పిన వారికే..
- 12 వరకు ఫీజు గడువు.. 17న పరీక్ష..

కేయూ క్యాంపస్, ఆగస్టు 7: కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ విద్యార్థులకు వర్సిటీ అధికారులు సువర్ణ అవకాశాన్ని కల్పించారు. ఇటీవల నిర్వహించిన డిగ్రీ 6వ సెమిస్టర్‌లో ఏదైనా ఒకే ఒక్క పేపర్ తప్పిన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రత్యేకంగా ఇన్‌స్టంట్ పరీక్షను నిర్వహిస్తారు. వర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ బీబీఏ, బీసీఏ తదితర కోర్సుల్లో ఆఖరు సెమిస్టర్‌లో ఏదైనా థియరీ పేపర్‌లో తప్పిన అభ్యర్థులు ఆగస్టు12 వరకు ఫీజులు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలదేవి బుధవారం తెలిపారు. బీఏ, బీకామ్, జనరల్ (బీఏ లాంగ్వేజెస్) అభ్యర్థులు రూ.450, బీఏ, బీబీఏ, బీకాం, బీఎస్సీ, కంప్యూటర్ అభ్యర్థులు రూ. 550, బీసీఏ అభ్యర్థులు రూ. 650, బీకామ్ వొకేషనల్ రూ. 720 కళాశాలలో చెల్లించుకోవాలని తెలిపారు. ఫీజులు చెల్లించుకున్న అభ్యర్థులకు ఆగస్టు 17న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. కాగా, కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్‌లో ఎల్‌బీ కళాశాల, హనుమకొండలో వాగ్దేవి డిగ్రీ కళాశాల, ఉమ్మడి ఆదిలాబాద్ మంచిర్యాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (బాయ్స్) ఉమ్మడి ఖమ్మంలో పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖమ్మంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గర్ల్స్ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

● ఒకరి మృతి

డోర్నకల్, ఆగస్టు 7 : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి ముల్కలపల్లి వద్ద చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్‌రావు తెలిపిన వివరాల ప్రకారం. జోగ్యతండాకు చెందిన చాందావత్ రాంబాబు (29) సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై ఖమ్మంకు వెళ్లాడు. పనులు ముగిసిన అనంతరం స్వగ్రామమైన జోగ్యతండాకు తిరిగి క్రమంలో కురవి మండలం బలపాలకు చెందిన వెంకటేశ్వర్లు, అతనిభార్య ద్విచక్రవాహనంపై ఖమ్మంకు వెళ్తున్నారు. ముల్కలపల్లి వద్దకు చేరుకోగానే ఇరువురి ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈఘటనలో రాంబాబు తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం 108 ద్వారా ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆయన మృతి చెందాడు. వెంకటేశ్వర్లు, అతని భార్య స్వల్పగాయాలతో బయటపడ్డారు. మృతుడు రాంబాబుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్‌రావు తెలిపారు.

చెక్‌డ్యాంలో పడి గీత కార్మికుడి మృతి

దంతాలపల్లి, ఆగస్టు 7 : మండలంలోని లక్ష్మీపురానికి చెందిన గీత కార్మికుడు దొరపెల్లి పెంటయ్య (55) ప్రమాదవశాత్తు బుధవారం పాలేరు చెక్‌డ్యాంలో పడి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం. దొరపెల్లి పెంటయ్య ఓ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి వచ్చే క్రమంలో పాలేరు వాగులో చెక్‌డ్యాం దాటే క్రమంలో కాళ్లు జారీ పడి మృతి చెందాడు. అటుగా వెళ్లే వారు పాలేరు వాగులో పడి ఉన్న పెంటయ్యను చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు యాకయ్య ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకోని కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు పెంటయ్యకు భార్య, కుమారుడు ఉన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు..

నర్సింహులపేట, ఆగస్టు 7 : మండల కేంద్రంలోని ఆదర్శ (మోడల్) పాఠశాలలో ఇంగ్లీష్ బోధించే ఓ ఉపాధ్యాయుడు బుధవారం తెల్లవారు జామున గుండె పోటుతో మృతి చెందాడు. తోటి ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం. ఖమ్మం పట్టణానికి చిలుకబత్తిని రవి (54) కొంతకాలంగా నర్సింహులపేట మోడల్ స్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారి మాదిరిగానే ఈనెల 6న పాఠశాలలో విధులు ముగించుకొని ఖమ్మంలోని ఇంటికి వెళ్లాడు. మంగళవారం అర్థరాత్రి గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు గమనించి స్థానిక ప్రైవేటు హాస్పటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య నళిని, కూతురు, కుమారుడు ఉన్నారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంట్..

కేసముద్రం, ఆగస్టు 7 : మండలంలోని అర్పనపల్లి గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కల్వగూరి రవి(42) అనారోగ్యంతో బుధవారం మృతి చెం దినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

జీపీ సిబ్బందికి నోటీసులు జారీ

దంతాలపల్లి, ఆగస్టు 7 : మండలంలోని తూర్పుతండా గ్రామ పంచాయతీ సిబ్బంది ముగ్గురికి బుధవారం నోటీసులు జారీచేసినట్లు ఎంపీవో అప్సరపాషా తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బంది మూడవత్ రాములు, బద్రు, కారోబార్ బద్రుకు నోటీసు జారీ చేశామన్నారు. వీరు జీపీకి సంబంధించిన వీల్‌చైర్, వాటర్ ట్యాంకుతో పాటు ఇతర ఫర్నీచర్‌ను మాజీ సర్పంచ్‌కు అప్పగించినందుకు నోటీసులు జారీ చేశామన్నారు. రెండు రోజుల్లోగా మాజీ సర్పంచ్‌కు అప్పగించిన ఫర్నీచర్‌ను గ్రామ పంచాయతీకి తరలించాలని, లేనట్లయితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

డోర్నకల్‌ను కంటికి రెప్పలా కాపాడుకుంటా

● ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

దంతాలపల్లి, ఆగస్టు 7 : డోర్నకల్ నియోజకవర్గాన్ని నిత్యం కంటికి రెప్పలా కాపాడుకుంటానని ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం ఆయన దంతాలపల్లి మండల కేంద్రంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన పీహెచ్‌సీలో మొక్కలను నాటారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ఆదుకుంటుందన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకుడు పొన్నోటి బాలాజీ, కొమ్మినేని రవీందర్, గిర్వాణి, నారాయణగౌడ్, మాజీ ఎంపీటీసీ సతీష్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వహించొద్దు

మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్



మాట్లాడుతున్న మురళీనాయక్

గూడూరు, ఆగస్టు7 : ప్రజాసమస్యల పరిష్కారం పట్ల అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హెచ్చరించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత గూడూరు బస్టాండ్ ఆవరణలో 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమానికి హాజరై మొక్కను నాటారు. గూడూరు సబ్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన రైతు పొలంబాట కార్యక్రమానికి ట్రాన్స్‌కో డీఈ విజయ్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ప్రజాప్రభుత్వంలో అధికారి చేసిన తప్పువల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని చెప్పారు. 'స్వచ్ఛదనం- చ్ఛదనం' కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. వర్షాకాలంలో ఎక్కువగా ఈదురు గాలులకు విద్యుత్ సమస్యలు తలెత్తుతాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశానికి హాజరు కానీ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో వీరస్వామిని ఆదేశించారు.ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, డీడీ మాలోతు సేవ, ఆర్టీసీ డిపోమేనేజర్ ప్రసున్నలక్ష్మి, వైద్యాధికారులు యమున, రాంబాబు, ఏటీడీవో భాస్కర్, ఏడీ కవిత, ఏపీఎం రవీందర్, డీఈ ఉపేందర్, డీఆర్వో మాధవి, డాక్టర్ రాము, కాంగ్రెస్ జిలా, మండల నాయకులు రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, చిట్టి వెంకటేశ్వర్లు, కొమ్మాలు, మధు, శ్రీపాల్‌రెడ్డి, యాకయ్య, మాదాసు రమేష్, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ముగింపు వేడుకలు

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ పండగ ప్రతీక అని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. గూడూరులో తీజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోతీజ్ ముగింపు వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రకృతిని ఆరాదించే తీజ్ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం డప్పుచప్పుళ్ల మధ్య గోధుమ మొలకల బుట్టలతో ఊరేగింపు చేస్తున్న వేడుకల్లో గిరిజన యువతులతో కలిసి మురళీనాయక్ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో తీజ్ ఉత్సవ కమిటీ సలహాదారులు నూనావత్ రమేష్‌నాయక్, కొమ్మాలు, అధ్యక్ష, కార్యదర్శులు ధర్మానాయక్, బాలునాయక్, వాల్యనంద కన్నెగురుస్వామి, బానోత్ లక్ష్మణ్‌నాయక్, భరత్‌నాయక్, గోపినాథ్, సురేష్‌నాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న డీఈవోను తొలగించాలి

● టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి



తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న చావ రవి

మహబూబాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న అసమర్థ డీఈవో రామారావును తక్షణమే తొలగించాలని టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. అక్రమాలకు పాల్పడుతూ విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న డీఈవోను తొలగించాలని మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట టీఎస్ యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో బదిలీలు, పదోన్నతుల విషయంలో తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా జరగని అవకతవకలు, ఇక్కడ జరగడానికి కారణం అర్హతలు లేని డీఈవో ఉండడమే కారణమని మండిపడ్డారు. పదోన్నతుల్లో ఎస్సీ మహిళల కోటాలో పురుషులను నింపడం ఇది తప్పని చెప్పినా పట్టించుకోకుండా ఉండడం డీఈవో అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. యూటీఎఫ్ కృషితోనే తిరిగి మహిళలకు పదోన్నతులు లభించాయని పేర్కొన్నారు. బదిలీల్లో భార్యాభర్త ఒకేచోటికి వెళ్లాలని, స్పౌజ్ పాయింట్స్ కేటాయించి వారిని ఒకే దగ్గరికి పోకుండా జిల్లా కేంద్రానికి దగ్గరలా కోరుకునేలా సహకరించడం, డిప్యూటేషన్ రద్దు చేయాలనే ఉపాధ్యాయుడినే డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీగా నియమించుకోవడం, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులు సరిపడా చూపించకపోవడం ఇవన్నీ డీఈవో అక్రమాలకు నిదర్శనమన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఎ.మురళీకృష్ణ, ఎస్కే. యాకూబ్, ఎస్డీ.జియావుద్దీన్, రమేష్, స్వప్న, నామ వెంకటేశ్వర్లు, ఎం.వీరస్వామి, కె.భిక్షపతి, ఎ.వెంకన్న, పి.మంజుల, జనార్ధనాచారి, ఎం.మంజుల, జి.వివేక్ పాల్గొన్నారు. కాగా, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ జి.సూర్యప్రకాశ్, సంఘీభావం ప్రకటించారు.

స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషి

(5వ పేజీ తరువాయి)

గ్రామీణ స్థానిక సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. గ్రామీణ, పట్టణ సంస్థల అభివృద్ధికి కావాల్సిన నిధులను సమకూర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. కేంద్రప్రభుత్వం మన రాష్ట్ర స్థానిక సంస్థల అభివృద్ధికి నిధుల మంజూరులో జాప్యం లేకుండా సిఫారసు చేసిన నిధులను మంజూరయ్యేలా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకు నిధులు కేటాయించామన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 ఎల్, 243వై ఆదేశం ప్రకారం మన రాష్ట్రంలోని అన్ని గ్రామీణ స్థానిక సంస్థలు, పట్టణాల ఆర్థిక స్థితిగతులను సమీక్షించడానికి, ఆర్థిక వనరుల పంపిణీ సిఫారసు చేయడానికి రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసిందన్నారు. గ్రామ పంచాయతీల అధికారుల విధులు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 52 ప్రకారం గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలు మరిచిపోవద్దని రాజయ్య పేర్కొన్నారు. విద్యుత్ చార్జీల అధిక బారం పడకుండా ప్రతీచోట సోలార్ పవర్ ప్లాంట్లను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతీ గ్రామ పంచాయతీలో క్రమం తప్పకుండా ప్రతీ 60 రోజుల్లో గ్రామసభ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ- గ్రామాల్లో పారిశుధ్య ఇతర అభివృద్ధి పనులకు సకాలంలో నిధులు అందుబాటులో ఉన్నట్లయితే ప్రతీ పనిని త్వరితగతిన పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా ఆర్థిక సంఘం జిల్లాలకు స్పెషల్ ఫండ్స్ మంజూరు చేయాలని కోరారు. బకాయిలు ఉన్న ప్రతీ గ్రామపంచాయతీకి ప్రభుత్వ పనుల చెల్లింపులు వాటికి అయిన నిధులు వెంటనే మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక సంఘం మెంబర్ సెక్రెటరీ స్మితా సబర్వాల్ మాట్లాడారు. ఈ సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మమబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, ఆర్థిక సంఘం సభ్యులు రమేష్ నాయక్, నెహ్రూనాయక్, హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్, జిల్లా పరిషత్ సీఈవోలు, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

జోరువాన

(5వ పేజీ తరువాయి)

కలిగింది. పట్టణంలోని కొన్ని వార్డుల్లో వరదనీరు ప్రవహించింది. ఆర్టీసీ కాలనీలో వరదనీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. పాత రైల్వేగేటు ప్రాంతం, కేసముద్రం రోడ్డులోని పీఎన్ఆర్ సమీప రోడ్డుపై నుంచి భారీగా వరదనీరు ప్రవహించింది. దీంతో వాహనదారులు



మానుకోట ఆర్తిగార్డెన్ సమీపంలో రోడ్డుపై చెట్టుకూలడంతో ఆగిన బస్సులు, వాహనాలు

ఇబ్బందులుపడ్డారు. పెనుగొండ క్రాస్‌రోడ్డు వద్ద నేతాజీతండా ప్రాథమిక పాఠశాలలోకి వర్షపు నీరు చేరుకుంది. అయితే ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈదులపూసపల్లిలో పొలాల్లోనుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో చేపల పట్టేందుకు ఆ గ్రామ ప్రజలు పరుగులు తీశారు.

గూడూరులో కూడా భారీ వర్షం కురిసింది. ఊట్ల గ్రామంలో ఫీడర్ చానెల్‌కు గండి పడిందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. భారీ వర్షం కారణంగా భీమునిపాదం జలపాతం ఉప్పొంగుతూ.. భారీగా నీరు జాలువారుతోంది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తుండడంతో ఆ ప్రాంతం సందడిగా మారింది. పోలీసులు, ఫారెస్టు అధికారులు రక్షణ చర్యలు తీసుకోకపోవడంలో విఫలమయ్యారని సందర్శకులు ఆరోపిస్తున్నారు. కేసముద్రంలోనూ భారీ వాన పడింది. ఉప్పరపల్లి రోడ్డులోని కల్వర్టు వద్ద లోపలి భాగంలో కాలువ కోతకు గురైంది. బయ్యారం మండలంలో భారీ వర్షం కురుస్తుండడంతో పాకాలవాగు, ఆలిగేరు వాగుల్లో నీరుదరికి అనుకుని ప్రవహిస్తున్నాయి. వరదనీరు పొటెత్తడంతో ఈ రెండు వాగులు మున్నేరువాగులో కలుస్తుండడంతో గార్ల, డోర్నకల్ వైపు వెళ్లే మున్నేరువాగుకు వరదనీటి తాకిడి ఎక్కువై ఉధృతంగా ప్రవహిస్తుంది. కొత్తగూడ మండలంలో ఓ మోస్తారు వర్షం కురిసినప్పటికి రాత్రి మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసి బుధవారం నుంచి ఓ మోస్తారు వర్షం కురుస్తుంది.

దాంతో బూర్కపల్లి, కొత్తపల్లి, గాంధీనగర్, కత్తెర్లవాగు, మున్నీవాగులు పొంగిప్రవహిస్తున్నాయి.

గంగారం వద్ద పందిపంపుల వాగు ప్రవహిస్తుంది. మరిపెడ మండలంలోని ఎల్లంపేట వద్ద రాళ్లవాగు పొంగుతుండడంతో మరిపెడ-ఎల్లంపేట మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తానంచెర్ల వద్ద పాలేరు వాగు ప్రవహిస్తోంది. మండలంలోని పలు గ్రామాల్లోనూ రోడ్లపై వరదనీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దంతాలపల్లి, ఇనుగుర్తి, సీరోలు, నర్సింహులపేట, నెల్లికుదురు, తొర్రూరు మండలాల్లో భారీ వర్షం కురియగా పెద్దవంగరలో ఓమోస్తారు వర్షం కురిసింది. నెల్లికుదురులో ఆలేరు-వావిలాల మధ్య ఉన్న కాజ్‌వే పైనుంచి నీరు పొంగి ప్రవహిస్తోంది.



మహబూబాబాద్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరువాగు

కొత్త జీపీగా చంద్రుతండా

కేసముద్రం, ఆగస్టు 7 : మండలంలోని వెంకటగిరి శివారులోనిచంద్రుతండాను గ్రామపంచాయతీగా చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మండల పరిషత్ అధికారులు బుధవారం తెలిపారు. గత ప్రభుత్వంలో హయాంలోనే చంద్రుతండాను గ్రామపంచాయతీ చేయాలని ప్రతిపాదనలు పంపిన నేపథ్యంలో తాజాగా ఉత్తర్వులు విడుదల అయ్యాయి. రాబోయే సర్పంచ్ ఎన్నికలు ఈ నూతన గ్రామపంచాయతీకి సైతం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

కూరగాయల సాగును పరిశీలించిన మరియన్న

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 7 : జిల్లాలో కురుస్తున్న వర్షాలతో నర్సింహులపేట, దంతాలపల్లి, నెల్లికుదురు, మండలాల్లోని కూరగాయల తోటలను, పూలతోటలను జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి మరియన్న బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అధిక వర్షాలు కురుస్తున్న కారణంగా పంటలు దెబ్బతినే అవకాశం ఉందని, యాజమాన్య పద్ధతులు పాటించాలని కోరారు. తోటలలో నిలిచిన నీరును వెంటనే తొలగించాలని రైతులకు ఆయన సూచించారు.

కేంద్రమంత్రిని కలిసిన జాటోత్ హుస్సేన్‌నాయక్



కేంద్రమంత్రితో మాట్లాడుతున్న హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీలో కేంద్రగిరిజన సంక్షేమ శాఖమంత్రి జుయల్ ఓరమ్‌ను బుధవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ కలిశారు. రాష్ట్రంలోని గిరిజన సమస్యలపై చర్చించారు. గిరిజనులు అత్యధికంగా ఉండే జిల్లా మహబూబాబాద్‌లో ఎస్టీలకు శాశ్వత ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో షెడ్యూల్ తెగల ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, ఏకలవ్య, గిరిజన సంక్షేమ పాఠశాలల అభివృద్ధికి మరిన్ని నిధులు విడుదల చేయాలని కేంద్రమంత్రిని కోరినట్లు హుస్సేన్ నాయక్ తెలిపారు.

'సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

నెల్లికుదురు, ఆగస్టు 7 : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సీహెచ్.రమేష్ బాబు తెలిపారు. నెల్లికుదురు మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆపద సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ ఏఎస్సై వెంకటరెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

● మునిసిపల్ వైస్ చైర్మన్ వెంకన్న

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 7 : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టకరమని స్థానిక మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 24వ వార్డు పరిధిలోని నందినగర్‌లో బుధవారం తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. కాలనీలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. జిల్లా వైద్యాధికారి కళావతిభాయి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లీలా, కౌన్సిలర్లు ఎడ్ల వేణు, హరిసింగ్, మార్నేని కిరణ్, డాక్టర్ శివ, పొబిలిశెట్టి రామకృష్ణ, దీన, అశ్వినీ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గుర్రం బాబా ముఠా ?

నర్సింహులపేట, ఆగస్టు 7 : జిల్లాలోని నర్సింహులపేట పోలీసులు ఓ గుర్రం బాబా ముఠాను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన లక్ష్మణ్‌తో పాటు మరో నలుగురు ముఠాగా ఏర్పడ్డారు. నర్సింహులపేట మండలంలోని జయపురంలోని రెండుపడకల ఇండ్ల వద్ద గుర్రంపై స్వారీచేస్తూ, స్థానికులకు లేనిపోని అనుమానాలను వ్యక్తపరుస్తూ, బాగుచేస్తామని ప్రజలనుభయభ్రాంతులకు గురిచేస్తూ, ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారనే పోలీసులకు సమాచారం అందింది. దీంతో గుర్రం బాబా లక్ష్మణ్‌తో పాటు మిగతా ముఠా సభ్యులను నర్సింహులపేట పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఎస్సై జి.సతీష్‌ను వివరణ కోరగా..గుర్రంతో పాటు ఐదుగురిని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

మెనూ ప్రకారం భోజనాలు అందించాలి : డీఈవో

తొర్రూరు, ఆగస్టు 7 : ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు మెనూప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని డీఈవో రామారావు అన్నారు. బుధవారం తొర్రూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. అప్పారావు, శ్రీరాములు, బుచ్చయ్య, లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

● తొర్రూరు రూరల్ : పాతికేళ్లుగా ఒకే పాఠశాలలో ఉంటూ విద్యార్థులు, ఉపాధ్యాయుల మన్ననలను పొందిన చెర్లపాలెం సబార్డినేటర్ ఎస్.సరళ సేవలు అభినందనీయని డీఈవో రామారావు అన్నారు. చెర్లపాలెం ఉన్నత పాఠశాలలో గత 25 ఏళ్లుగా సబార్డినేటర్‌గా విధులు నిర్వహించి బదిలీల్లో భాగంగా అమ్మాపురం పాఠశాలకు వెళ్తున్న సరళకు బుధవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి శాలువాలతో సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం మహంకాళి బుచ్చయ్య, ఏసీజీ శ్రీరాములు, డీఎస్‌వో అప్పారావు, ఉపాధ్యాయులు తనుజ, స్వర్ణలత, ఉపేందర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రవీందర్, పద్మావతి, రాధాదేవి పాల్గొన్నారు.

● మరిపెడ : ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని డీఈవో రామారావు అన్నారు. మరిపెడ బంగ్లాలోని సీతారాంపూర్ హైస్కూల్, పీఎస్ స్కూల్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రిజిస్ట్రర్లను చెక్‌చేశారు. పాఠశాల పరిసరాలను తనిఖీ చేశారు. ఆయన వెంట శ్రీరాములు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రాంచంద్రయ్య, అర్జున్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రజా కలల పండుగలో తెలంగాణ జాతి పోరు ఆల్బమ్

● మానుకోట చిన్నారి కళాకారుల ప్రదర్శన



హైదరాబాద్ రవీంద్రభారతిలో నృత్య ప్రదర్శన చేసిన మానుకోట చిన్నారులు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 7 : హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రజా కలల పండుగలో సీపీఐ మానుకోట మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి. అజయ్‌సారదిరెడ్డి రచించి రూపొందించిన ఆల్బమ్‌ను ప్రదర్శించారు. తెలంగాణ జాతి పోరు పాటకు మానుకోట ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. అక్కడికి వచ్చిన ప్రముఖులు గీతాన్ని రచించిన బి. అజయ్‌సారథిరెడ్డితో పాటు నృత్య ప్రదర్శన చేసిన చిన్నారి కళాకారులను అభినందించారు. ప్రజానాట్యమండలి మానుకోట జిల్లా బాధ్యులు కట్లోజు పాండురంచారి, కేదాసు రమేష్, నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, తండా శ్రీనాథ్, చిన్నారి కళాకారులు వాసవి, చంద్రిక, అక్షిత, వర్షిత, లాస్య, సమీరా, నవ్య పాల్గొన్నారు.

విధుల పట్ల అలసత్వం వద్దు

● ఏఎస్పీ జోగుల చెన్నయ్య

సీరోలు, ఆగస్టు 7 : విధి నిర్వహణలో ఆలసత్వం వహించవద్దని జిల్లా అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య అన్నారు. సీరోలు పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ చెన్నయ్య మాట్లాడుతూ... పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఆలసత్వం వద్దని, గుడుంబా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ చేపడుతున్న తనిఖీలను పకడ్బందీగా చేపట్టాలని ఎస్సై విజయ్‌రాంకుమార్‌ను ఆదేశించారు.

ప్రతీ విద్యార్థి మొక్కలు నాటాలి

● ఎఫ్‌ఆర్వో వజాహత్

కొత్తగూడ, ఆగస్టు7 : ప్రతీ విద్యార్థి మొక్కలు నాటాలని ఎఫ్‌ఆర్వో వజాహత్ సూచించారు. మండలంలోని పొగుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో ఎఫ్‌ఆర్వో వజాహత్. విద్యార్థులు మొక్కలు నాటారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలు బహుమతులు అందజేశారు. అటవీశాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక కురవి మండల కమిటీ ఎన్నిక

కురవి, ఆగస్టు 7 : జన విజ్ఞాన వేదిక కురవి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వై.ఉమాదేవి తెలిపారు. మండల అధ్యక్షులుగా తేలుకుంట్ల సునీత, ప్రధాన కార్యదర్శిగా వెంపటి విజయ్‌రాజ్, కోశాధికారిగా దర్గయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు పి.బ్రహ్మం, దయానంద్, మంగపతిరావు, ఆగుర్తి సురేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి

పోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వరరావు

మరిపెడ రూరల్, ఆగస్టు 7 : వర్షకాలంలో వచ్చే సీజనల్‌వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం తానంచర్ల, బుర్హాన్‌పురం ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక వైద్యాధికారి గుగులోతు రవి, సూపర్‌వైజర్స్ సుదర్శన్, ఝాన్సీ, ఏఎన్‌ఎంలు లలిత, రోజమణి, ఆశాలు పాల్గొన్నారు.

కెపాసిటర్ వినియోగంతో లాభాలు

● డీఈ మధుసూదన్

తొర్రూరు రూరల్, ఆగస్టు 7 : రైతులు తమ విద్యుత్ సర్వీసుకు కెపాసిటర్ వాడడం వల్ల లాభాలు జరుగుతాయని తొర్రూరు విద్యుత్ డీఈ మధుసూదన్ తెలిపారు. స్వచ్ఛత-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా విద్యుత్ శాఖ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ పొలం బాట కార్యక్రమం అమ్మాపురంలో బుధవారం నిర్వహించారు. ఏడీఈ చలపతిరావు, ఏఈ వంశీ, స్థానిక సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జాతీయ చేనేత దినోత్సవం



కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పద్మశాలీలు

తొర్రూరు, ఆగస్టు 7 : జాతీయ చేనేత దినోత్సవాన్ని పద్మశాలీల ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కొండ లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాలతో నివాళి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ మానవుడు ధరించే వస్త్రాలు పద్మశాలీలు తయారుచేయడం ఎంతో గొప్ప అని, నైపుణ్యం ఉన్న పద్మశాలీలు ఉపాధి కోసం సూరత్, భీమండి లాంటి ప్రాంతాలకు వలస వెళ్తున్నారని ప్రభుత్వం ఉపాధి కల్పించాలని కోరారు. జిల్లా పద్మశాలి సంఘం నాయకులు కందగట్ల సోమశేఖర్, కూరపాటి సోమయ్య, జగన్, కొండ్లె ఉమేష్, ప్రసాద్, వెంకట్, పూర్ణచందర్, విక్రమ్, సంతోష్, భాస్కర్, శ్రావణ్ పాల్గొన్నారు.

●పెద్దవంగర : చేనేత కార్మికులు దేశానికి వెన్నుముక అని లయన్స్‌క్లబ్ ఆఫ్ పెద్దవంగర మండల అధ్యక్షుడు ఏదునూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రేణుక అన్నారు. సోమవారం జాతీయ చేనేత కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ నేత కార్మికులను అవార్డు, చేనేత వస్త్రాలతో సన్మానించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, అనపురం రవి, ఎర్ర వెంకన్న, కోట శంకర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

తొర్రూరు, ఆగస్టు 7 : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలని లయన్స్ క్లబ్‌జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలుచేపట్టారు. లయన్స్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ సుధాకర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారావు, వెంకట్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిదురాల నవీన్‌కుమార్, తమ్మి రమేష్, పి.వెంకటేశ్వర్లు, రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.